
# డౌరీ డెత్

ఆచార్య కొలకలూరి ఇనాక్



తలుపు తట్టిన శబ్దం.

లత ఉలిక్కిపడింది. తలుపు దగ్గరగా వెలుపల మనుషులు కదలాడిన చప్పుడు. అలికిడి.

గుండె వేగంగా కొట్టుకోసాగింది. గడియారం గుండె చప్పుడు వినబడుతూ ఉంది. రెండు గంటలు.

చుట్టూ చీకటి. లైటు లేదు. లేవాలంటే భయం. లైటు వేయాలంటే భయం.

మళ్ళీ తలుపు తట్టారు.

లత లేచి కూర్చుంది. బయట చప్పుళ్ళు. కదలిక, నడక.

లత నిశ్శబ్దంగా భర్తను తట్టింది. తలుపు వైపు చూస్తూ భర్తను తడుతూ ఉంది. ఎంతకీ భర్త కదల్లేదు. బన్నీను లాగింది. కదల్లేదు.

చీమ చిటుక్కుమంటే లేచే భర్త. తట్టినా లేవలేదు. లాగినా కదల్లేదు.

భర్త ముఖంలోకి చూచింది. సరీగ్గా కనిపించలేదు. నిద్రపోతున్నాడు. దొంగనిద్ర కాదు. నిజమే. నిద్రపోతున్నాడు. అది మామూలు కాదు. అంతగా నిద్రపోడు.

మళ్ళీ తలుపు మీద చప్పుడు.

కూర్చున్న లత నెమ్మదిగా జారింది. కదలకుండా పడుకొంది. నిశ్శబ్దంగా ముసుగు పెట్టుకొంది.

లత కాపురానికి వచ్చిన దగ్గర్నుంచి కంటి మీద కునుకు లేదు. రాత్రి నిద్ర పట్టదు. పడితే ఉలిక్కిపడుతుంది. మెలకువ వస్తుంది. అంతే సంగతులు. రాత్రంతా మెలకువే!

తాను కదిలితే భర్త కదులుతాడు. ఏమిటంటాడు. నిద్రపాడు చేసుకొంటాడు. భర్త నిద్రాభంగం కారాదు. తానే మేల్కొని ఉంటుంది.

అటువంటి లత భర్తను లేపింది. భర్త లేవలేదు. లాగింది. గుంజింది. చలనం లేదు.

లత కళ్ళు గుండ్రంగా ఉంటాయి. చక్రాలులా తిరుగుతాయి. ఆమెకు అందం ఆమె కళ్ళే. అదే రవిని కట్టిపడేశాయి.

లత కళ్ళు ఆమె ముఖంలో తిరుగుతుంటే రవి ఆ కళ్ళ చుట్టూ తిరిగాడు. అంత అందమైన కళ్ళు భూప్రపంచం మీద లేవన్నాడు. ఆకళ్ళు కావాలనుకొన్నాడు. ఈ జన్మలోనే సొంతం కావాలనుకొన్నాడు. కళ్ళతో పాటు లత కూడా కావలసివచ్చింది.

కళ్ళు సొంతం చేసుకోవటానికి లతను సొంతం చేసుకొన్నాడు. పెళ్ళిలో కట్నం కానుకల ప్రస్తావన లేదు. అడిగినా వాళ్ళు ఇవ్వలేరు.

అడిగిలేదనిపించుకోలేదు. పెళ్ళిచూపుల్లోనే పెళ్ళాడతానని రవి చెప్పేశాడు. తల్లి మందలించబోయింది. వినలేదు. అన్న వారించబోయాడు. పట్టించుకోలేదు.

అన్నకూ అమ్మకూ తప్పలేదు. పెళ్ళి జరిపించారు. లోపల అప్పుడు పుట్టిన కోపం అల్లారుముద్దుగా పెరుగుతూ వచ్చింది.

రవి లత కళ్ళను ఆరాధించటం మొదలుపెట్టి లతనే దేవతను చేశాడు. రవి ప్రేమ చూస్తుంటే తల్లి గుండె తరుక్కుపోతుంది. అన్న అంకమ్మ శివాలెత్తుతున్నాడు.

లత కాపురానికి వచ్చింది. రవికి దగ్గరగా వచ్చింది. కానీ, పుట్టింటికి దూరమయింది. నిద్రకు భారమయింది.

నిద్రలేని కళ్ళు నీరసంగా ఉంటున్నాయి. వాడిపోయిన పూలులాగా మారాయి. అంతేకాదు. కళ్ళ కింద నల్లగీతలు వచ్చాయి. తోడుగా ముడతలు ఏర్పడ్డాయి.

ఫలితం. క్రమంగా కళ్ల అందం క్షీణించిపోసాగింది. గుండె గదిలో వెలుతురు మాయమయింది. కిటికీల వంటి కళ్ళలో వెలుగు మాయమయింది.

నీ కళ్ళకేమయిందంటే ఏమో నా ముఖం అంటుంది లత. నీ ముఖానికేమయిందంటే ఏమో నా కర్మ అంటుంది. నీ కర్మ కతేమిటంటే నిద్ర లేమని తేల్చి చెప్పింది.

నిద్రెందుకు లేదంటే లత దగ్గర సమాధానం లేదు.

డాక్టర్ల దగ్గరకెళ్ళారు. లాభం లేదు. పుట్టింటికి పంపాడు. ప్రయోజనం లేదు. సినిమాలు చూపాడు. దేవాలయాలు తిప్పాడు.

ఇల్లు వదిలి వెలుపలికి వస్తే లత చిందులు వేస్తుంది. లేడి పిల్లలా మారిపోతుంది. ఇంటికి వస్తే ముడుచుకుపోతుంది. మూగదవుతుంది.

తలుపు తట్టారు.

శబ్దం వింది. కళ్ళు తెరవలేదు. తలుపు వైపు చూడలేదు. ముసుగు ముఖం మీదికి లాక్కొంది. కదల్లేదు. మెదల్లేదు. నిద్రపోతున్నట్లు నటిస్తూ ఉంది.

భర్తను నెట్టింది. తోసింది. పీకింది. గుంజింది. కదల్లేదు.

తమతో అత్తా బావా మాత్రమే ఉన్నారు. బావ అక్కను పురుటికి పంపాడు. ఇంట్లో ఇంకెవరూ లేరు.

అప్పట్లో లత పెళ్ళి జరగదనుకొన్నారు. అత్తింటి వాళ్ళు సంపన్నులు. పుట్టింటి వాళ్ళు నిరుపేదలు. వాళ్ళు కట్నం అడక్కాపోరు. వీళ్ళు లేదనకాపోరు అనుకొన్నారు.

అంతా తారుమారయింది. రవి పట్టుదల నెగ్గింది. తల్లి మాట దాటాడు. అన్నమాట అడ్డుకొన్నాడు. అందుకే ప్రమాదం పొంచి ఉంది.

ఏ కళ్ళు రవి కాంక్షించాడో, ఆ కళ్ళిప్పుడు లేవు. వాటి స్థానంలో చూపు ఉంది. వెర్రిచూపు. అందం పోయింది. పిచ్చి చూపు వచ్చింది.

తలుపు దగ్గర నిశ్శబ్దం. శబ్దం వస్తే లత భయపడటం సామాన్యమయిపోయింది. అలికిడి లేకపోతే ఆందోళన పట్టుకొంది. ఏంచేస్తారో అని దిగులు.

తలుపు తడుతున్నంత సేపూ వాళ్ళు ఏం చేస్తున్నారో తెలుస్తూ ఉంది. తలుపు తట్టకపోతే ఏంచేస్తారోనని భయంగా ఉంది.

కాపురానికి రావటం భయం పుట్టటం ఒకేసారి జరిగాయి. కాపురం భయం కవలపిల్లలు.

అత్త లతతో మంచిగా మాట్లాడిన రోజులు లేక పోలేదు.

అత్త మంచిమాటలన్నీ డబ్బు మాటలే! పెళ్ళి కట్నం ఇవ్వలేదు కానీ, కట్నం కానుకల రూపంలో డబ్బు పుట్టింటి నుంచి తెచ్చుకోవాలని అత్త సూచించింది.

తల్లిదండ్రుల పేదరికం లత అత్తకు వివరించింది.

జీవితాంతం నీకు అప్పనంగా తిండి పెట్టి పోషించటం మాకు సాధ్యం కాదంది. నీ తిండికి సరిపడే డబ్బు నువ్వు తెచ్చుకోమంది. బేంక్‌లో వేసుకోమంది. నెలనెలా వడ్డీ తెచ్చుకోమంది. సుఖపడమంది.

అత్త మాట కాదనలేక తల్లిదండ్రుల్ని లత అడక్కపోలేదు.

అమ్మా నాన్నా ఏడ్చారు. నిన్ను చదివించాం. ఉద్యోగం చేస్తావని ఆశించాం. నీ సంపాదన మీద బతకొచ్చుననుకొన్నాం. కానీ పెళ్ళి ముంచుకొస్తే, మా స్వార్థం వదులుకొన్నాం. అదే మాకు సాధ్యమయిన మంచిపని అని తేల్చి చెప్పి, నీకు తెలియకుండా మాకే ముంది, పేదరికం ఆకలి తప్ప అన్నారు. అంతటితో ఊరుకోలేదు. నా పెన్షన్‌తో మేం సర్దుకొంటాం. ఈ ఇల్లుంది. మా తదనంతరం నీదే! ఇప్పుడే కావాలంటే అమ్ముకో. మేం చెట్టు కిందో, చీమ కిందో ఉంటాం అని తండ్రి అంటే లత భరించలేకపోయింది.

ఈ స్థితిలోనే లత భర్త వద్దంది. కాపురం వద్దంది. అత్తింటికి పోనంది. పుట్టింట్లో ఉంటానంది. ఉద్యోగం చేస్తానంది. తల్లిదండ్రుల్ని చూచుకొంటానంది. అమ్మానాన్నల ఋణం తీర్చుకొంటానంది.

తల్లిదండ్రులు వారించారు. అత్తింటిలో దిగబెట్టి వచ్చారు. అట్లా ఆలోచన మళ్ళీ రానియ్యవద్దని హెచ్చరించారు.

కాపురానికి వచ్చిన రోజునుంచి అత్త మీద అనుమానంగానే ఉంది. ఆస్తిపాస్తులు రావని తెలిసిన దగ్గర్నుంచి అత్త అగ్ని పర్వతంలాగా కనబడుతూ ఉంది. ఎప్పుడు పగిలి బద్దలవుతుందో!

లత అనుమానం ఊరికే రాలేదు. ఊరికే పోలేదు.

తనను దరిద్రంగా అత్త భావించటం అనటం అలవాటయి పోయింది. సూటిపోటి మాటలు సామాన్యమయిపోయాయి. సణుగుళ్ళు నసుగుళ్ళు దినచర్యగా మారిపోయాయి.

కొడుకు ఇంట్లో లేనప్పుడు ఒసే ఏమే అనే అత్త, ఆఫీసు నుంచి రాగానే, రామ్మా పోమ్మా అంటుంది. కొడుకంటే ప్రేమ ఉంది. కోడలంటే కోపం ఉంది. కొడుకుకు కష్టం కలగరాదు. కోడలు ఏడ్చినా ఫరవాలేదు. మొత్తుకొన్నా చింతలేదు.

ఒంటరిగా ఉంటే అగౌరవం. జంటగా ఉంటే గౌరవం.

భర్త రోజంతా ఆరేడు గంటలు ఇంట్లో ఉండడు. ఆ క్షణాల్లో నరకమే! నిద్రయినా పోయే ప్రయత్నం చేస్తుంది. పెరట్లోనయినా కూర్చుంటుంది. వీలున్నంత వరకు తప్పించుకొని తిరుగుతుంది.

'ఇది చస్తే పీడ విరగడవుతుంది' అని అత్త అనుకోసాగింది అనసాగింది.

'మరో పెళ్ళి చేయవచ్చు. బంగారంవంటి సంబంధాలు బంగారంతో వస్తాయి' అనీ అంటూ ఉంది.

ఆమె అన్నమాటలకు బావ అంగీకారం ఉంటుంది. ఆమె తానా అంటే తాను తందానా అంటున్నాడు. ఆమె సై అంటే అతను బళాబళి అంటున్నాడు. ఆమె మాట, అతను శబ్దం.

'చస్తుందా? చంపాలి గానీ ' అనీ, 'ఊరికే చస్తుందా? ఊపిరి తీయాలిగానీ' అనీ బావ అనటం చాలా సార్లు వింది లత.

'నాకు భయంగా ఉంది' అంది ఒక రోజు భర్తతో రాత్రి మంచంమీద.

'చీకటంటే భయమా?' అని బుజ్జగించాడు.

'మీ అమ్మ అంటే భయం, ఎలా అన్న అంటే చచ్చేంతభయం' అంది.

'అత్త అన్నా, బావ అన్నా ఆ మాత్రం భయం ఉండటం న్యాయమే. ' అని రవి నవ్వాడు.

'నాకు ప్రాణభయంగా ఉంది. ' అంది.

'పిచ్చిభయం వద్దు, అమ్మ మంచిది, దేవత. అన్న దైవం. నీకిప్పుడు తెలియదు. ముందు ముందు నువ్వే తెలుకొంటావు. డబ్బు మీద మమకారం ఉన్నా క్రమంగా వాళ్ళే అన్నీ మర్చిపోతారు. వాళ్ళ గుండెల్లో చోటు సంపాదించుకోవాలి. పిచ్చి లతా నిద్రపో' అని బుజ్జగించి, కబుర్లు చెప్పి, ప్రేమగా చూచుకోవాలని నిద్రపుచ్చాడు.

ఆ రోజే లత హాయిగా నిద్రపోవటం, మిగతా కాలమంతా మెలకువే! విరామంలేని మెలకువ, నిద్ర ఎంత గొప్పవరం! నిద్ర ఎంత సామాజిక న్యాయం! నిద్ర లేదు. లత శాపగ్రస్తురాలు, శరీర శక్తి, ఆరోగ్యం ఆకర్షణ, కళ్ళ అందం అన్నీ నిద్రలేమి హరిస్తూ ఉంది.

లత కళ్ళు లతవి కాకుండా పోయాయి. ఆమె అందం అంతరించి పోయింది. వికృతంగా మారింది. వికారంగా తయారయింది. రోజు చూస్తున్న మనిషికి కూడా తేడా తెలుస్తుంది.

తన రూపం తనకే భయంకరంగా ఉంది. రాక్షసి ఇలాగే ఉంటుంది. కాబోలు, దెయ్యం రూపం ఇలా ఉండవచ్చు. లత దెయ్యం పట్టిన మనిషిగా మారింది. క్రూరంగా కూడా అనిపించసాగింది. హత్యలు చేసే మనుషులు ఇలా ఉంటారని అతను చూపించవచ్చు. తన ప్రతిబింబం తనకే అసహ్యంగా ఉంది.

' నీ ఆరోగ్యం జాగ్రత్త . నవ్వుతూ ఉండాలి. హుషారుగా ఉండాలి!' అని భర్త సహితం చెబుతూనే ఉన్నాడు.

అర్నెల్ల క్రితం పెళ్ళి పీటల మీద కూర్చున్న అందాల బొమ్మ ఈ లతేనా అని ఆశ్చర్యపోయేటట్లు మారిపోయింది మనిషి.

రవికి ఏం చెప్పినా తల్లి దేవత అంటాడు. అమ్మానాన్నలకు ఏంచెప్పీ లాభంలేదు. అయినా లత పట్టు వదల్లేదు. 'మీ అమ్మ నన్ను చంపుతుంది' అని చెవిలో ఊదింది. రవి విని పగలబడి నవ్వాడు. రెట్టించి చెబితే కోపపడ్డాడు. అమ్మ నీకు అర్థం కాలేదు. అన్నాడు. అన్నీ అనుమానించవద్దనీ , అనుమానం పెనుభూతమనీ, చివాట్లు పెట్టాడు. అమ్మ ఆదర్శ మాతృమూర్తి అన్నాడు. రవి ఇంకా తల్లి కొంగుచాటు బిడ్డ . పెళ్ళి విషయంలో పెద్దవాడుగా ప్రవర్తించాడు. లేకపోతే పిల్లవాడే,

అత్త పాతికేళ్ళ క్రితం భర్తను పోగొట్టుకుంది. అప్పటికి రవికి పదినెలలు, బావకు మూడేళ్ళు. పాతికేళ్ళకే ఆమె భర్తను నోచుకోలేదు. పిల్లలకోసం ఆస్తికోసం పెళ్ళి మానుకొంది. వాళ్ళను సక్రమంగా పెంచి పెద్ద చేసింది. వాళ్ళను కళ్ళు లాగా చూసుకొంది.

పెద్దవాడు తల్లిమాట జవదాటలేదు. చిన్నవాడు అన్నింటా అన్నపోలికే కాని, పెళ్ళిలో పెడసరంగా మారాడు. తల్లి మాట వినలేదు. లెక్కపెట్టలేదు. అప్పటి నుంచి ఆమె ఆరని కుంపటి. కోడల్ని చూస్తే వొళ్ళంతా మంట. కాలి పోతుంది. పొగలు. సెగలు పట్టించి కోపం. మళ్ళీ తలుపు తట్టారు.

లత లేచి కూర్చుంది అలికిడి ఆలకించింది.

'అత్తమ్మా' అని పిలిచింది.

'ఏమ్మా' అని అత్త పలికింది.

'దొంగలేమో- ఏదో అలికిడి'

(తరువాయి 31వ పేజీలో)

**లత కళ్ళు లతవి కాకుండా పోయాయి. ఆమె అందం అంతరించి పోయింది. వికృతంగా మారింది. వికారంగా తయారయింది. రోజు చూస్తున్న మనిషికి కూడా తేడా తెలుస్తుంది. తన రూపం తనకే భయంకరంగా ఉంది. రాక్షసి ఇలాగే ఉంటుంది. కాబోలు, దెయ్యం రూపం ఇలా ఉండవచ్చు. లత దెయ్యం పట్టిన మనిషిగా మారింది.**

'దొంగలా పాడా ? నేనే! తలుపు తీయ్'

'ఎందుకూ?'

'పనుంది!'

లతకు నిర్ణయమయింది. 'అత్తాబావా కలసి చంపుతారు. ఖాయం'అనుకుంది.

అక్క పుట్టింటికి పోయిన దగ్గర్నుంచి బావ చూపులు చీదర చీదరగా ఉన్నాయి. చికాకు. చికాకు. 'వీళ్ళిప్పుడేం చేస్తారో ఏమో' సందేహం.

తలపు దగ్గర గుస గుసలు, లతకు అర్థమయింది. 'ప్రమాదం ఖాయం'.

లతకు ఒకసారి చావు తప్పింది. పెరట్లో చేదబావి .రాత్రి నీళ్ళు తోడుతుంటే అత్తా, బావ వచ్చి బావిలో తోయబోయారు. ఏడ్చింది. గింజుకుంది. గిలక పట్టుకుంది. పట్టే పట్టుకొంది. పిట్టగోడ వదల్లేదు. చప్పా తొక్కిపట్టింది. అరుస్తూ ఉంది. అప్పుడే వచ్చాడు భర్త. చుట్టు పక్కల ఇళ్ళలో లైట్లు వెలిగాయి.

లతకు కళ్ళు తిరిగి బావిలో పడబోయింది. పట్టి ఆపానని తల్లి చెప్పింది. బావిలో దూకి ఆత్మ హత్య చేసుకొని మనల్ని అనుమానాల పాలు చేయాలని చూస్తుంది. అన్నాడు బావ.

'చచ్చే చావేదో మీ ఇంట్లో చావు. మా ఇంట్లో వద్దు' అన్నారు అత్తాబావలు.

ఏడ్చింది లత. 'ఇప్పుడు నీళ్ళు తోడే పని నీకెందుకు? ' అని కసురుకున్నాడు. 'జారిపడితే కష్టం బావి దగ్గరకు పోవద్దు' అన్నాడు. నీళ్ళు తోడటం అప్పటినుంచి తప్పింది కానీ ప్రాణ భయం తప్పలేదు.

'తలుపు తీయ్ లతా' అత్త అడుగుతూ ఉంది. చంపటానికి వచ్చారు వాళ్ళు.

రక్షించవలసిన భర్త నిద్రపోతున్నాడు. అంతగా ఎప్పుడూ నిద్రపోడు. కదిపింది. లేవలేదు. నెట్టింది. దొర్లలేదు. తోసింది. కాలూచేయీ మంచంలోంచి జారాయి.

లతకు భయం కలిగింది. ఏడ్పు వచ్చింది. చెమట పట్టింది.

భర్త ముక్కు దగ్గర చేయి పెట్టింది. ఊపిరి ఆడుతూ ఉంది. పట్టరాని ఆనందం. అంతలోనే దుఃఖం.

'ఏమండీ! ఏమండీ!!' అంటూ పిలిచింది. అరిచింది. రవి మూలిగాడు. లేవలేదు.

చిన్న గుర్తు. పెద్ద ఆలోచన.

రాత్రి భర్తకు తాను పాలు కలిపి ఇవ్వలేదు. అత్త కలిపింది. తాను ఇచ్చింది.

లతకు తెలిసిపోయింది. భర్త లేవడు. తెల్లారినా పొద్దెక్కినా లేవడు. సూర్యుడు మండినా, చంద్రుడు కాలినా, లేవడు.

# డౌరీడెత్

(28వ పేజీ తరువాయి)

తాను చచ్చినా, బతికినా తెలియదు.

లత వణుకు తగ్గుతూ ఉంది.

రైలాగుతున్నప్పుడు పెట్టెలు కొట్టుకొన్నట్లు శరీరం అసంకల్పితంగా అల్లాడింది.

'వీళ్ళు నన్ను చంపుతారు' నిశ్చయించుకొంది.

'నేను చావను' ఆవురుమని ఏడ్చింది.

'నేను బతకాలి' బావురుమంది.

'చచ్చినా చావను' లేచి కూర్చుంది.

తలుపుకున్నా గడి బోల్టులు బయట నుంచి విప్పుతున్నారు.

భయంగా ఉంది.

ఊడుతున్నాయి.

భయం భయంగా ఉంది.

**భర్త వినడు. చూడడు. మాట్లాడడు. మౌని, మహామౌని. మహర్షి. తన శరీరం పరాధీనం. తన ప్రాణం పరాధీనం.**

తలుపు తెరచుకొంది. భయం. భయం. భయం. భయం పోయింది. ధైర్యం వచ్చింది.

అత్త వచ్చింది. లైటు వేయలేదు. బావ వచ్చాడు. తలుపులోంచి వెలుతురు.

'ఏమండీ! ఏమండీ!!' గావు కేకలు.

రవి లేవలేదు.

అత్త లత నోరు మూసింది.

'చంపుతారు!' అర్థమయింది.

'గొంతు కోస్తారా?' తెలియదు, 'పీక నొక్కుతారా?' తెలియదు. 'బావిలో వేస్తారా?' తెలియదు.

రవి లేవడు. రక్షించలేడు.

తండ్రి రాడు. కాపాడలేడు.

తనను కాపాడవలసిన మొగవాళ్ళు కాపాడలేరు.

దేవుడుండాలి! ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు. దేవుడూ మగాడే! మగాళ్ళు రక్షించరు.

తనను రక్షించేవాళ్ళు లేరు. తనను తాను రక్షించుకోవాలి.

తాను ఆడపిల్ల. అబల. ఆరోగ్యం లేదు. శక్తి లేదు. పెళ్ళితో ఉన్న కాస్తా శక్తి ఊడిపోయింది. భయమే మిగిలింది. అదే మింగేసింది.

ఆరునెలల్లో నూరేళ్ళు నిండుతాయా? ఇది మృత్యు ముఖం. 'తాను చావరాదు. చస్తే చావరాదు'.

ఓపిక లేదు. కన్నీళ్ళు లేవు. నోట్లో మాట లేదు.

భర్త వినడు. చూడడు. మాట్లాడడు. మౌని, మహామౌని. మహర్షి. తన శరీరం పరాధీనం. తన ప్రాణం పరాధీనం. ఇది కుట్ర. దీనికి గుర్తుగా దేవుడిలాంటి భర్త. ఆయుధంలాంటి భర్త. కత్తిలాంటి భర్త. నిద్రపోతున్నాడు. తనకు తనే దిక్కు.

నోరు మూసి పెరట్లోకి లాక్కొచ్చారు. ఇంట్లో చంపరు. బావిలోకి తోస్తారు.

పడేటప్పుడు అరుస్తుంది. ఎవరైనా వింటారా? బావిలో పడితే శబ్దం వస్తుంది. ఎవరైనా ఆలకిస్తారా? వస్తారా? రక్షిస్తారా?- తెలియదు.

కిరోసిన్ టిన్ను. తెలిసిపోయింది కల్సి చంపుతారు.

అత్త కొప్పు పట్టుకొంది. నోరు మూసే ఉంచింది.

బావ టిన్ను ఎత్తి లత నెత్తిన పోయబోతున్నాడు. లతకు తెలుస్తూ ఉంది. ఆమె రెండు చేతులూ ఖాళీగా ఉన్నాయి. బావ రెండు చేతుల్లో టిన్ను ఉంది. అత్త రెండు చేతులూ నోరు మూసి కొప్పు పట్టి తీరుబడి లేకుండా ఉన్నాయి.

బావ టిన్ను వంచుతున్నాడు. 'చస్తే చావను' అనుకొంది లత. 'చస్తే చస్తాను' అని గింజుకొంది. చుట్టూ అర్ధరాత్రి చీకటి.

లత రెండు చేతులెత్తి టిన్ను వెనక్కు నెట్టింది. నిండు టిన్ను అత్త నెత్తిన పడింది. బావ చేయి పట్టుతప్పింది. నడి నెత్తి మీద కిరసనాయిలు వొలికింది. టిన్ను కారుతూ లత చేతుల్లోంచి, బావ చేతుల్లోంచి నెమ్మదిగా కిందికి పడింది. అత్త వొళ్ళంతా కిరోసిన్‌తో తడిసిపోయింది. కింద బడ్డీ టిన్ను వొలికిపోతుంటే బావ మళ్ళీ పైకెత్తాడు. మళ్ళీ నెడితే బావ మీదే పడింది. కారిపోయింది.

'ఏమిట్రా ఇది' అని అత్త అరుస్తూ ఉంది. గింజులాట, లాగులాట, పీకులాట అయిపోయింది. టిన్ను ఖాళీ అయింది. అత్త బావ తడిసి ముద్దయ్యారు. లత కల్లం తొక్కింది. అదుసు తొక్కింది. కిరసనాయిల్‌తో కాళ్ళు కడుక్కొంది. అత్తాబావా తలస్నానం చేశారు. దూరంగా అగ్గిపెట్టె వెలుగుతూ ఉంది. లత అందుకొంది.

పుల్ల గీసింది. వెలుతురులో ముఖం సూర్యుళ్ళా ఉంది. ●

(29 వ పేజీ తరువాయి)

బాటిలే? నడండి, స్టేషన్‌కి. జైలుకు జైలూ, అయిదు వేలు పైనూ తప్పదు మీకు" అన్నాడు. 'ఏదో సరదాకి' అంటూ మావాడు నసుగుతూ రెండు ఏభై కాగితాలు తీశాడు. 'నేనెలాగ కన్పిస్తున్నాను. వం

దిచ్చేసి పోదామనే. ఇదేమన్నా ఆషామాషీ కేసేంటీ!' అని నెమ్మదిగానే అయినప్పటికీ కటువుగా అన్నాడు. నా దగ్గరున్న డెబ్బై మా వాడికిచ్చాను. ' అది కాద్సార్. ఇంతకంటే మా దగ్గర ప్రస్తుతం లేదు. మళ్లీ రేపిలా వచ్చినప్పుడు మిమ్మల్ని మరిచిపోను' అంటూ మా వాడు బతిమాలడం మొదలెట్టేశాడు. 'ఇంకేం చెప్పొద్దు. స్టేషన్‌కి నడవండి. నీ మీద రెండు కేసులున్నాయి తెలుసా' అన్నాడు. ' రేపు పొద్దుటే ఆఫీసుకెళ్లాలి. ఇన్‌స్పెక్షన్ వుంది. వెళ్లకపోతే ఉద్యోగానికి ముప్పు. కాస్త దయ తలచండి.అంటూ మా వాడు పోలీసు చేతులు పట్టుకున్నాడు. పోలీసు గుండె కరిగింది" అని గోపాలం గ్లాసందుకుని సిప్‌చేసి, సిగరెట్ వెలిగించాడు.

" ఒక్కోసారి గుండెలు కూడా కరుగుతాయండి " అన్నాడు శర్మ గుటకేసి కళ్లు మూసుకుంటూ.

" ఉద్యోగానికే ముప్పు వస్తుందంటున్నావ్. నీ కడుపు కొట్టి పాపం కట్టుకోలేను. ఓపన్జేద్దాం అని పోలీసు,తన చొక్కా పై బొత్తం విప్పి, నా చేతిలోని బాటిల్ తీసుకుని, షర్టులోపల పెట్టుకుని, నేను మూడంకెలు లెక్క పెట్టేలోగా మీరిక్కడ నుంచి పోవాలి. 'ఒన్' అని ఆగాడు పోలీస్. మా వాడు మోటార్ సైకిల్ స్టార్టు చేశాడు. 'టు' అన్నాడు. నేనెగిరి సీటు మీద కూర్చున్నాను. 'త్రీ' అన్నాడు. మేమక్కడుంటే ఒట్టు" అని గోపాలం గ్లాసెత్తి పెద్ద గుటక వేసి, చిన్నగా సకిలించాడు.

" ఆశా నిరాశేనా, మిగిలిందీ ప్రయాసేనా" అంటూ కొటేషన్‌రావు అందుకున్నాడు.

" పాపం ఎంత నిరాశో కదా"

" కవి కుమారా, తమరు తమ కవిత ఏ పత్రికనుంచైనా తిరిగొచ్చినప్పుడు కూడా అంత నిరాశపడి వుండరనుకుంటాను"

" అబ్బే! కథ్రాజువారు తమ కథ తిరిగొచ్చినప్పుడు పడినంత ఆనందం పొందాను" అన్నాడు కవి కుమారుడు ఒళ్లుమండి.

కథ్రాజు ఏదో అనబోయేటప్పటికి "ఇక ఇవాళ్టికి జనగణమన పాడేద్దాం, చాలా టైమయింది" అంటూ లేచి నిలబడి, బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ కొటేషన్‌రావు రాగం తీస్తూ అన్నాడు.

" నాది నాది అనుకున్నది నీది కాదు రా, నీది నీది అనుకున్నది నాది ఔనురా"

వచ్చేవారం: అనుభవించు రాజా 'అనుభవించు'! ●